పేదల ఇళ్ల స్థలాలను పరిశీలించిన ట్రైనీ కలెక్టర్

మంగళగిరి: నగర పరిధిలోని నవులూరులో జిల్లా ట్రైనీ కలెక్టర్ శివనారాయణశర్మ ఆకస్మికంగా పర్యటించారు. మంగళవారం ఆయన మండల సర్వేయర్ నాయక్‌తో కలసి నవులూరులో పేదలకు నివేశన స్థలాలు కేటాయించిన భూములను సందర్శించి జరుగుతున్న జంగిల్ క్లియరెన్స్ పనులను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ సాంబశివరావు, గ్రామ సర్వేయర్ స్టాలిన్, వీఆర్ఓ ఆయూబ్ పాల్గొన్నారు.

విరామ బైబిల్ తరగతులు ప్రారంభం



మంగళగిరి: నగర పరిధిలోని పాత మంగళగిరి మంచి కాపరి లూథరన్ చర్చిలో మంగళవారం సంఘ కాపరి దాసిపాల్ ఆధ్వర్యంలో విరామ బైబిల్ పాఠశాల తరగతులు ప్రారంభమయ్యాయి. మంగళవారం నుంచి ఆదివారం వరకు ఆరు రోజులపాటు తరగతులు నిర్వహించనున్నారు. మొదటి రోజు సండే స్కూల్ చిన్నారులతో ర్యాలీ నిర్వహించారు. చిన్నారులకు బైబిల్ పాఠాలు, యాక్షన్ సాంగ్స్, మిషనరీ కథలు, వర్క్‌బుక్స్ వంటి కార్యక్రమాలతో మొదటి రోజు తరగతులను ఆహ్లాదకరంగా నిర్వహించారు. తరగతుల్లో సండే స్కూల్ టీచర్లు బైబిల్‌కు సంబంధించిన కథలను బాలబాలికలకు అర్థమయ్యేలా ఆటపాటలతో వివరించారు. కార్యక్రమంలో సండే స్కూల్ టీచర్స్, యువతీ, యువకులు, చిన్నారులు పాల్గొన్నారు.

అకాల వర్షం... అన్నదాతకు కష్టం



నిడమర్రులో కల్లాల్లో ఆరబోసిన మిర్చి, మొక్క జొన్న పంటలకు టార్పాలిన్ పట్టలు కప్పిన రైతులు



నగరంలో జలమయమైన రోడ్లు



తాడేపల్లి: నేలవాలిన మునగ తోట

- తడిసిన మిర్చి, మొక్కజొన్న
- నష్టపోయిన రైతన్నలు
- నగరంలో జలమయమైన రహదారులు

మంగళగిరి: అకాల వర్షంతో అన్నదాతలు కుదేలయ్యారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నగర పరిధిలోని నిడమర్రు, యర్రబాలెం, నూతక్కి, పెదవడ్లపూడి, రామచంద్రాపురం, చినకాకాని, కాజ పరిధిల్లో కల్లాల్లోని మొక్కజొన్న, మిర్చి తడిసింది. చేతికి వచ్చిన కల్లాల్లో ఉన్న పంటను కాపాడుకునేందుకు రైతులు పరుగులు పెట్టారు. చాలా వరకు పంట తడిచి పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

నగరంలో రోడ్లు జలమయం...

నగరంలో మంగళవారం జోరువాన కురిసింది. ఉదయం నుంచే ఎడ తెరిపి లేకుండా కురిసిన వానకు రోడ్లన్నీ జలమయమయ్యాయి. జోరువానతో ప్రజలు బయటకు రాలేకపోయారు. నగరంలోని ప్రధాన రోడ్లన్నీ నీట మునిగాయి. చిరు వ్యాపారులు, తోపుడు బండ్ల వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



తాడేపల్లి: విరిగిపడిన అరటి చెట్లు

తాడేపల్లిరూరల్: మంగళవారం కురిసిన వర్షానికి తాడేపల్లి పట్టణ రూరల్ పరిధిలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పంట పొలాల్లో కల్లాల్లో ఉన్న వండిన పసుపు తడిసి ముద్దయింది. మరో పదిహేనురోజుల్లో పంట చేతికి రానుండగా మొక్కజొన్న నేలకొరగడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. తాడేపల్లి ప్రాంతంలోని తెల్లక్వారీ ప్రాంతంలో క్వారీ గుంతల్లో ఇళ్లు ఏర్పాటు చేసుకుని నివసిస్తుండడంతో రోడ్లపై నీరు భారీగా వచ్చి చేరి నడవడానికి వీలులేకుండా పోయింది. తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలో అవుట్‌పాల్ డ్రెయిన్‌లు అస్తవ్యస్తంగా ఉండడంతో వర్షపు నీరు, మురుగు రోడ్లపై చేరింది. ఉండవల్లి, పెనుమాక, యర్రబాలెం ప్రాంతాల్లో ఎక్కువ శాతం మునగను పండిస్తున్నారు. అకాల వర్షం కారణంగా మునగచెట్లు కూలిపోయి చెట్లకున్న పూత రాలిపోవడంతో దిగుబడి భారీగా తగ్గుతుందని రైతులు తెలిపారు. తాడేపల్లి, దుగ్గిరాల ప్రాంతాల్లో కల్లాల్లో ఉన్న పసుపు పూర్తిగా తడిసిపోయింది. మొక్కజొన్న, జొన్న కోతకోసిన రైతులు పంట పాడవకుండా పరదాలు కప్పి కాపాడుకున్నారు. వర్షంతోపాటు చిన్నపాటి గాలి వీయడంతో అరటి చెట్లు విరిగిపోయాయి. ఓల్డ్ టోల్‌గేటు వద్ద భారీగా వర్షపు నీరు చేరడంతో ద్విచక్రవాహనాలపై ప్రయాణించేవారు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

దాడి ఘటనపై పోలీసులకు ఫిర్యాదు

మంగళగిరి: మద్యం మత్తులో తనపై ముగ్గురు యువకులు రాళ్లతో ఓ యువకునిపై దాడికి పాల్పడ్డారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు... తుళ్లూరు మండలం వెంకటపాలెం గ్రామానికి చెందిన పులి కిరణ్ అలియాస్ ఉదయ్‌కుమార్ నగరంలోని రాయల్ గ్యాస్ కంపెనీలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం రాత్రి గుంటూరు నుంచి సిలిండర్ల లోడు లారీలో నగరంలోని ఆర్టీసీ డిపో రోడ్డులో గల గ్యాస్ గోడౌన్‌కు రాగా అదే సమయంలో రోడ్డుపై కూర్చొని మద్యం సేవిస్తున్న పాత మంగళగిరికి చెందిన డి వెంకటేష్ అలియాస్ నాని తన ఇద్దరు స్నేహితులతో కలసి కిరణ్‌పై రాళ్లతో దాడికి పాల్పడగా గాయాలయ్యాయి. బాధితుడు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పసుపు రైతులు సంఘటితం కావాలి

తాడేపల్లిరూరల్ : దేశవ్యాప్తంగా పసుపు పండిస్తున్న రైతులందరూ ఏకమై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు వచ్చి మద్దతు ధర వచ్చేంత వరకు పోరాడాలని గుంటూరు జిల్లా రైతు సంఘం నాయకులు జొన్నా శివశంకరరావు అన్నారు. మంగళవారం దుగ్గిరాల రైలుపేటలో పసుపు వర్తకుల సంఘం భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒక ఎకరంలో పసుపు పండించడానికి రూ.రెండు లక్షలు ఖర్చు అవుతోందని, వాతావరణంలో మార్పులు రావడంతో తీవ్రంగా రైతులు నష్టపోతున్నారని, పండించిన పంటకు లక్ష రూపాయలు కూడా ధర రావడం లేదని అన్నారు. బుధవారం దుగ్గిరాల రైలుపేట పసుపు వర్తకుల సంఘంలో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తున్నామని, ఈ సదస్సుకు ప్రతి ఒక్క పసుపు రైతు హాజరు కావాలని కోరారు. సమావేశంలో వల్లభనేని సాంబశివరావు, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు జెట్టి బాలరాజు, దుగ్గిరాల మండల కార్యదర్శి యార్లగడ్డ బ్రహ్మేశ్వరరావు, మంగళగిరి నియోజకవర్గ రైతు నాయకులు ఆళ్ల సాంబిరెడ్డి, కొర్రపోలు ఈశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



బెజ్జంకి బాబు (ఫైల్)

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని డోలాస్‌నగర్‌లో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై తాడేపల్లి పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. డోలాస్‌నగర్‌లో నివాసముండే బెజ్జంకి బాబు (39) కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో రెండు నెలల కిందట భార్య లక్ష్మి పుట్టింటికి వెళ్లింది. మనస్తాపం చెందిన బాబు తెల్లవారుజామున తాను నివాసముండే ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందాడు. బాబు మృతిపై బంధువులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

ఫుట్‌బాల్ క్రీడాకారులకు ఉచిత శిక్షణ

ఫిరంగిపురం: స్థానిక గాలిబాలి మినీ స్టేడియంలో మంగళవారం సీయాప్‌సీ ఆధ్వర్యంలో క్రీడాకారులకు ఫుట్‌బాల్ ఆటలో ఉచిత శిక్షణ కార్యక్రమం రిటైర్డ్ పీడీ హృదయరాజు ప్రారంభించారు. క్రీడాకారులకు కోచ్‌లు వి.నాని, వి.చరణ్‌లు శిక్షణ ఇచ్చారు. 40రోజులపాటు శిక్షణ ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో వి.శ్రీనివాసరావు, బి.ప్రభుదాసు, ప్రదీప్, ఏసోబు, షరీఫ్, కె.సుబ్బారావు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు అందజేత

నిడమర్రు(మంగళగిరి): నగర పరిధిలోని చిరు వ్యాపారులకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) తోపుడు బండ్లు అందజేశారు. నిడమర్రుకు చెందిన చిరు వ్యాపారులు యడ్ల గోపి అన్నపూర్ణ, కొండ పిచ్చయ్యలు పండ్లు, కూరగాయలు విక్రయించి జీవనం సాగిస్తుంటారు. ఇటీవల ఎమ్మెల్యే ఆర్కే నిడమర్రు పర్యటనలో ఇరువురు చిరు వ్యాపారులు తమకు వ్యాపారం చేసుకునేందుకు ఇబ్బందిగా ఉందని తెలపడంతో తోపుడు బండ్లు అందజేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ఆర్కే అందజేసిన తోపుడు బండ్లను చిరు వ్యాపారులకు మంగళవారం స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కొల్లి శేషిరెడ్డి, కాటా శివయ్య, అంజిరెడ్డి, సుబ్రమణ్యం, సాంబయ్య, కొండ మునలయ్య, సాగర్ రెడ్డి తదితరులున్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్



తాడికొండ: జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా చూడాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. బుధవారం గుంటూరు భారత్‌పేటలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా జగనన్న కాలనీలలో సౌకర్యాలు, ప్రస్తుతం జరుగుతున్న నిర్మాణాలు, మంజూరైనవి ఎన్ని ఇంకా ఏమైనా మౌలిక వసతులు కల్పించాల్సినవి ఉన్నాయా అనే దానిపై ఆరా తీసి త్వరితగతిన నిర్మాణాలు పూర్తిచేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో 4 మండలాల గృహ నిర్మాణ శాఖ ఏఈఈలు, సిబ్బంది పాల్గొన్నారు.